ప్రజాశక్తి

గురువారం 10 ఏప్రిల్ 2025

5

అల్లూరి సీతారామరాజు



జిసిసి గొడౌన్‌లో తనిఖీ

ప్రజాశక్తి-జీకే వీధి: జిల్లా జాయింట్ కలెక్టర్ సూచనల మేరకు గూడెం కొత్త వీధి మండల కేంద్రం లో జిసిసి ఎంఎల్ఎస్ గొడౌన్‌ని తహసిల్దార్ టీ.రామక్రిష్ణ తనిఖీ చేశారు. నిత్సావసర సరుకులు సకాలంలో డి ఆర్ డిపోలకు చేరవెయాలని, లేకుంటే తగు చర్యలు తీసుకుంటామని గొడౌన్ ఇంచార్జ్ వీరభద్రంకు సూచించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, జిసిసి గోడన్ ఇన్చార్జి వీరభద్రరావు, తది తరులు పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న తహశీల్దార్ రామకృష్ణ

రసాభాసగా సర్వసభ్య సమావేశం

-అక్రమ కట్టడాలపై నిలదీసిన సర్పంచ్ చిన్నబాబు



సమస్యలపై ప్రశ్నిస్తున్న సర్పంచ్ చిన్నబాబు

ప్రజాశక్తి అరకులోయ రూరల్: అరకులోయ మండల కేంద్రంలోని మండల సర్వసభ్య సమావేశం మందిరంలో ఎంపీపీ రంజపల్లి ఉషారాణి అధ్యక్షతన బుధవారం జరిగిన సర్వసభ్య సమావేశం రసాభాసగా సాగింది. వివిధ శాఖల అధికారులు తమ నివేదిక వివరాలను సభలో చదివి వినిపించారు.మండలంలోని పలు గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై సుంకరమెట్ట సర్పంచ్ అధికారులను నిలదీశారు. అరకులోయ మండల కేంద్రంలోని గిరినేతరులు బినామీ పేరుతో విచ్చలవిడిగా జోరుగా అక్రమ కట్టడాలు జరుగుతున్నాయన్నారు. సుంకరమెట్ట పంచాయితీ కేంద్రంలో సంత జరిగే ప్రభుత్వ స్థలంలో బినామీ పేరుతో గిరిజనేతరుడు నిర్మిస్తున్న అక్రమ కట్టడాలు కూల్చాలని సర్పంచ్ చిన్నబాబు సర్వసభ్య సమావేశంలో లేవనెత్తారు. విఆర్ఓ నోటీసు ఇచ్చినా బేఖాతారు చేసి అక్రమ కట్టడాలు జోరుగా సాగిస్తున్నారంటే అధికారులు ఏమైనా ముడుపులు తీసుకున్నారా అని ప్రశ్నించారు. దీనిపై స్పందించిన అధికారులు వెంటనే కూల్చాలని ఆదేశాలు జారీ చేశారు. అరకులోయ మండలంలోని 14 పంచాయతీ పరిధిలో జల్ జీవన్ మిషన్ పథకం కింద గ్రామాల్లో బోర్లు తవ్వి మధ్యలోనే గుత్తేదారుడు పనులు వదిలేయడంతో ట్యాంకులు, బోరు నిరుపయోగంగా మిగిలాయన్నారు. ప్రభుత్వం కోట్లాది రూపాయలు నిధులు కేటాయిస్తే గుత్తేదారుడు మధ్యలోనే పనులు ఆపేశారని దీంతో గ్రామాల్లో తాగునీరు కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. మండల, జిల్లా అధికారులు పర్యవేక్షణ లోపంతోనే జల జీవన్ మిషన్ పనులు ఎక్కడికక్కడే ఆగిపోయిన పరిస్థితి నెలకొందని ప్రశ్నించారు.అరకులోయ మండలం పెదలబుడు మేజర్ పంచాయతీ సరభగుడలో, సుంకరమెట్ట పంచాయితీ లింబగుడ గ్రామంలో జలజీవన్ మిషన్ పథకం కింద లక్షలాది రూపాయలు కేటాయిస్తే ఏ వీధిలో కూడా ఇంటింటికి కుళాయి కనెక్షన్ ఇవ్వకుండా బిల్లు మార్చిన పరిస్థితి ఉందన్నారు. అరకులోయ మండల కేంద్రంలోని గిరిజనేతరులు నిర్మిస్తున్న అక్రమ కట్టడాలపై ఎస్టీఆర్ కేసు నమోదు చేసి వారిపై చర్యలు తీసుకోవాలని అప్పుడే బినామీ వ్యవస్థకు అడ్డుకట్టు వేయడం సాధ్యం అవుతుందని పేర్కొన్నారు. మండలంలోని తాగునీరు సమస్య తీవ్రంగా ఉందని జల జీవన్ మిషన్ పథకం పై అధికారులు వెంటనే స్పందించి కాంటాక్టర్ పిలిపించి రివ్యూ చేసి గుత్తేదారులుపై చర్యలు తీసుకొని గిరిజన గ్రామాల్లో తాగునీరు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.మండలంలోని సుమారు 960 పైగా పోడు పట్టాలు మంజూరయ్యాయని, నేటికీ లబ్ధిదారులకు ఇవ్వలేదని పలువురు ప్రజాప్రతినిదులు ప్రశ్నించారు.వచ్చే సర్వసభ్య సమావేశంలో పట్టాలు పంపిణీ చేయకపోతే గిరిజనులతో కలిసి ఆందోళన చేస్తామని హెచ్చరించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం మాట్లాడుతూ, ప్రజా సమస్యలపై అధికారులు దష్టి సారించాలన్నారు. అభివద్ధి కార్యక్రమాల్లో ప్రోటోకాల్ పాటిస్తూ గిరిజన గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించడానికి ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మత్స్యలింగం



నిరసన చేపడుతున్న సిపిఎం నేతలు

పెంచిన గ్యాస్ ధరలు తగ్గించాలి

కట్టెల పొయ్యిపై వంట చేస్తూ సిపిఎం నిరసన

ప్రజాశక్తి-అరకులోయ రూరల్: కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరలు వెంటనే తగ్గించాలని సిపిఎం బొండం పంచాయతీ కొత్తవలసలో బుధవారం కట్టెల పొయ్యిపై వంట చేస్తూ ఖాళీ గ్యాస్ బండతో నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సిపిఎం మండల కమిటీ సభ్యులు గత్తుం బుజ్జిబాబు మాట్లాడుతూ, బిజెపి ప్రభుత్వం ప్రజలపై బాదుడు కార్యక్రమం ప్రారంభించిందన్నారు. ఎప్పుడు లేని విధంగా ఒకేసారి రూ.50 గ్యాస్ ధర పెంచి పేద ప్రజల పై భారం పెంచిందన్నారు. మరో వైపు రాష్ట్ర ప్రభుత్వం స్మార్ట్ మీటర్స్ బిగించి ట్రూ అఫ్, సర్దుబాటు చార్జీల పేరుతో ప్రజాలపై విధ్యుత్ భారాలు పెంచుతుందని విమర్శించారు. పెట్టుబడిదారులకు, కార్పొరేట్లకు లక్షల కోట్లు రూపాయలు మాఫీ చేస్తున్న కేంద్ర ప్రభుత్వం ప్రజలపై భారాలు మోపడం సిగ్గు చేటన్నారు. దీంతో, రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఉచిత గ్యాస్ పథకం పైన కూడా భారం పడుతుందన్నారు. పెంచిన గ్యాస్ ధరలను తగ్గించాలని కేంద్ర ప్రభుత్వంపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు. పెంచిన గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని, లేకపోతే ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు కె.అప్పన్న, టి జోషి, మహిళా సంఘం నాయకులు జి.శాంతి, ప్రియ, జి నీలమ్మ, టి.సుందరమ్మ, జి.పార్వతి, జి.దేవి, రేవతి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వెంకట్

జిసిసిలో అక్రమాలపై విచారణ జరిపించాలి : సిపిఎం

ప్రజాశక్తి-చింతూరు

చింతూరు కేంద్రంగా ఉన్న గిరిజన సహకార సంస్థలో జరిగిన అవినీతిపై విచారణ జరిపించాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పల్లపు వెంకట్ డిమాండ్ చేశారు. బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిసిసిలో అవినీతి తారాస్థాయికి చేరిందని, జిసిసి సంస్థ ప్రజల కంటే అందులో పని చేస్తున్న అధికారులకు లాభాలు చేకూర్చే సంస్థగా మారిందని పేర్కొన్నారు. తక్షణమే ఉన్నత అధికారులు జోక్యం చేసుకొని జిసిసిలో జరిగే అక్రమాలపై విచారణ చేయాలని, 2020 నుండి ఇప్పటి వరకు పనిచేసిన అధికారుల అక్రమ ఆస్తులపై సిబిఐ విచారణ చేయించాలని వెంకట్ డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రజలందరిని సమీకరించి ఆందోళనకు సిద్ధమవుతామన్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు పొడియం లక్ష్మణ్, కారం సుబ్బారావు, కారం మనోజ్, శేఖర్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం స్వీకరిస్తున్న ఎమ్మెల్యే శిరీషాదేవి

ప్రజల వద్దకే వచ్చి సమస్యల పరిష్కారం : ఎమ్మెల్యే శిరీషా దేవి

ప్రజాశక్తి-గంగవరం

ప్రజల వద్దకే వచ్చి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి అన్నారు. గంగవరం ఎంపీడీవో కార్యాలయంలో ప్రజా సమస్యల వేదిక కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఇందులో పాల్గొన్న ఆమె ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరి సమస్యలను తప్పకుండా పరిష్కరిస్తామని చెప్పారు. కార్యక్రమంలో గంగవరం సర్పంచ్ పలుముల అక్కమ్మ, తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు పాము అర్జున్, తీగల ప్రభ, కనిగిరి రాంబాబు, భాను ప్రకాష్, ఆదినారాయణ, రమణ, ప్రజలు పాల్గొన్నారు.

ఫీజులు చెల్లించలేదని పరీక్షలు రాయించని ప్రయివేటు స్కూల్ యాజమాన్యం

ప్రజాశక్తి -ముంచింగిపుట్టు: మండల కేంద్రానికి కూత వేటు దూరంలో ఉన్న దాసరిపుట్టు గ్రామ సమీపంలోనీ నేతాజీ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో వార్షిక పరీక్షలు నిర్వహిస్తున్నారు. బుధవారం సుమారు 40 మంది విద్యార్థులు ఫీజులు చెల్లించలేదని పాఠశాల ప్రిన్సిపాల్‌పై ఎంఈఓ కృష్ణమూర్తికు ఫోనులో విద్యార్థుల తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. తక్షణమే స్పందించిన ఎంఇఒ నేతాజీ ఇంగ్లీష్ మీడియం పాఠశాలకు విచారణకు సీఆర్పీలతో వెళ్లారు. పిల్లలు ఫీజులు చెల్లించకపోవడంతోనే పరీక్షలకు అనుమతి ఇవ్వలేదని ప్రిన్సిపాల్ ఒప్పుకున్నట్లు ఎంఈఓ వెల్లడించారు. సుమారు 40 మంది కి పైగా విద్యార్థులు పరీక్షలకు హాజరు కాకపోతే వారి భవిష్యత్తు ఏమవుతుందని ప్రశ్నించగా ప్రిన్సిపల్ పొంతన లేని సమాధానాలు చెబుతూ దాటవేశారు. అధిక ఫీజులతో విద్యార్థుల తల్లిదండ్రులు సకాలంలో చెల్లించలేకపోతున్నారన్నారు. కార్పొరేట్ సంస్థల స్థాయిలో గ్రామీణ ప్రాంతంలో ఫీజులు వసూలు చేయడం సరి కాదని ప్రిన్సిపల్ కు మండల ఎంఈఓ హెచ్చరించారు. ప్రభుత్వ నిబంధనలకు ఉల్లంఘించి ఫీజులు వసూలు చేసినందుకు ప్రభుత్వ ఉన్నతాధికారులకు వివరణ ఇవ్వాలని సూచించారు. ప్రిన్సిపల్‌పై తక్షణమే చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు డిమాండ్ చేశారు. గిరిజనుల అమాయకత్వాన్ని ఆసరా తీసుకొని ఇష్టానుసారంగా ప్రభుత్వ నియమ నిబంధనలను ఉల్లంఘిస్తూ, అధిక మొత్తంలో ఫీజులు వసూలు చేయడం సరికాదని తెలిపారు. ప్రిన్సిపల్ పై తక్షణమే ఎల్ టి ఆర్ కేసు నమోదు చేసి ఆదివాసి గిరిజన విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలని డిమాండ్ చేశారు. అధికారులు తక్షణమే స్పందించాలని, లేనిపక్షంలో జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో ఆందోళనకు వెనుకాడ బోమని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.



మాట్లాడుతున్న తల్లిదండ్రులు



పీసా గ్రామసభలో పాల్గొన్న అధికారులు, గ్రామస్తులు

పీసా గ్రామసభల ద్వారా సమస్యల పరిష్కారం

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

గ్రామాల్లో పీసా కమిటీ గ్రామసభలు నిర్వహణ ద్వారా సమస్యలు సత్వర పరిష్కారానికి అవకాశం ఉంటుందని పీసా కమిటీల మండల అధ్యక్షులు తాము సూరిబాబు అన్నారు. మండలంలోని లబ్బర్తి గ్రామ పంచాయతీ నెల్లిమెట్ల గ్రామంలో బుధవారం సీసా గ్రామసభ జరిగింది. గ్రామాల్లో మౌళిక సదుపాయాలు కల్పన, ఇతర సమస్యలపైనా, గిరిజన సంస్కృతి, ఆచార వ్యవహారాలను, గిరిజనులను హక్కులను పరిరక్షణకు తీర్మానాలు చేశారు. గ్రామానికి ఉన్న ఉమ్మడి ఆస్తుల వివరాలు తెలియజేశారు. ఈ సందర్భంగా సూరిబాబు మాట్లాడుతూ పీసా గ్రామసభకు హాజరు కావాలని తెలియచేసినా హాజరు కాని అధికారులపై పీసా చైర్మన్ దృష్టికి తీసుకువెళ్తామని చెప్పారు. కార్యక్రమంలో పంచాయతీ ఉపసర్పంచ్ బత్తిన రాజేశ్వరి, వార్డ్ మెంబర్లు ఈక ఆదినారాయణ, ముర్రం నూకరత్నం, పీసా గ్రామ కమిటీ కార్యదర్శి ఈక కౌసల్య పంచాయతీ కార్యదర్శి వంశీకృష్ణారెడ్డి, విఆర్వో నాగేశ్వరరావు, ఉపాధి హామీ ఏపీవో రెడ్డి బాబు, టిఎ శ్రీను, ఏఈఓ దుర్గాభవాని, బిఎఎ ప్రసాదు, విహెచ్ఎ రాజు, పిఎంఎ శ్రీకాంత్, మహిళా పోలీస్ వరలక్ష్మి, అంగన్వాడీ వర్కర్ విశ్రాంతి, ఆశా వర్కర్ సన్యాసమ్మ, విబికె స్వర్ణలత, ఫీల్డ్ అసిస్టెంట్ సత్యనారాయణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

సమస్యలపై గిడ్డి ఈశ్వరికి వినతి

ప్రజాశక్తి -సీలేరు : జీకే వీధి మండలం దారకొండ, దుప్పిలివాడ పంచాయతీల పరిధిలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని పాడేరు టిడిపి ఇన్చార్జి, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరికి మాజీ ఎంపీటీసీ పోతురాజు గోవిందా కుటమి నాయకులు విన్నవించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గంగవరం బ్రిడ్డి, అగ్రహారం బ్రిడ్జి నిర్మాణ పనులు చేపట్టాలని కోరారు. మారుమూల గ్రామాల్లో సిసి రోడ్లు నిర్మించాలన్నారు. దీనికి ఆమె సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో తెదేపా, జనసేన నాయకులు పాల్గొన్నారు.



మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరికి వినతిపత్రం ఇస్తున్న కూటమి నేతలు

అనారోగ్యంతో వలస కూలీ మృతి

-రోడ్డున పడ్డ చిన్నారులు

ప్రజాశక్తి -అనంతగిరి: పొట్ట కూడి కోసం తమ పిల్లల్ని చేతన పట్టుకుని వలస వెళ్లిన మహిళ కూలీ అనారోగ్యకారణంగా మృతి చెందడంతో నలుగురు చిన్నారులు వీధిన పడిన ఘటన రొంపల్లి నాన్ షెడ్యూల్ పంచాయతీ పరిధి బూరిగ గ్రామంలో చోటు చేసుకుంది.కుటుంబ పోషణ కోసం గ్రామానికి చెందిన కొంతమంది తో కలిసి సోమ్మెల .ఆదమ్మ జనవరి నెలలో బాపట్ల జిల్లా అద్దంకి మండలం పరిధి కల్వకూరు వద్ద ఇటుకలు బట్టిలో కూలి పని నిమిత్తం వెళ్లారని భర్త సోమ్మెల.సోమయ్య తెలిపాడు. తన భార్యకు వారం రోజులుగా ఆరోగ్యం బాగోలేదని, ఇటుకల బట్టి యాజమాన్యంకు చెప్పినప్పటికీ కనీసం పట్టించుకోలేదన్నారు. అందువల్లే తన భార్య మృతి చెందినట్లు తెలిపాడు. మూడు కిలోమీటర్లు డోలి సహాయంతో మృతదేహాన్ని బూరిగ గ్రామంలో కుటుంబ సభ్యులు సహకారంతో తరలించడం జరిగిందని భర్త బోరున విలపించాడు.



రోధిస్తున్న పిల్లలు



కరపత్రాన్ని విడుదల చేస్తున్న చిన్నయ్య పడాల్

ఉత్తరాంధ్ర సదస్సును జయప్రదం చేయాలి

ప్రజాశకి-. చింతపల్లి: విద్యుత్ రంగం ప్రైవేటుకరణ, పర్మినెంట్ ఉద్యోగాలు, కాంట్రాక్ట్ కార్మికులపై జరిగే ఉత్తరాంధ్ర సదస్సుని జయప్రదం చేయాలని. అల్లూరి జిల్లా విద్యుత్ ఉద్యోగులు కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికుల జిల్లా గౌరవ అధ్యక్షులు. బోనంగి చిన్నయ్య పడాల్ కోరారు. బుధవారం ఈనెల 12న శనివారం జరిగే ఉత్తరాంధ్ర సదస్సుకు సంబంధించిన కరపత్రాన్ని కార్మికులతో కలిసి చింతపల్లి విద్యుత్ సబ్ స్టేషన్ లో ఆవిష్కరించారు. అనంతరం చిన్నయ్య పడాల్ మాట్లాడుతూ, ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు, . విద్యుత్తు రంగంలో వివిధ విభాగాలలో తీసుకు వస్తున్న ప్రైవేటీకరణ విధానాలకు వ్యతిరేకంగా ఈపీడీసీఎల్ పరిధిలో విశాఖపట్నంలో ఈ సదస్సు జరుగుతుందన్నారు. ఈ సదస్సుకు ట్రాన్స్కో, జెన్కో డిస్కములలో పనిచేస్తున్న విద్యుత్ ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులందరూ హాజరు కావాలన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచలేదన్నారు. ఈనెల 12వ తేదీన విశాఖపట్నం డా బా గార్డెన్ లో ఉన్న అల్లూరి విజ్ఞాన కేంద్రంలో సదస్సు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంటాక్ట్ కార్మికులు. రాజబాబు, ప్రసాద్, సత్యనారాయణ, శేఖర్ పాల్గొన్నారు.

చివరి పంటకు అందని నీరు

- అడుగంటిన మద్దిగెడ్డ రిజర్వాయర్
- సంవత్సరాలుగా పూడిక తొలగించని వైనం



రిజర్వాయర్ గేట్లు సమీపంలో కుంగిపోయిన గట్టు



జెసిబితో రిజర్వాయర్ గర్భం నుండి కాలువ తవ్వుతున్న దృశ్యం

ప్రజాశక్తి-అడ్డతీగల

అడ్డతీగల మండల కేంద్రంలో గల మద్దిగెడ్డ రిజర్వాయర్ కింద ఆయకట్టు భూముల్లో రబీ వరి పంటకు చివరి దశలో నీరు అందని పరిస్థితి నెలకొంది. రిజర్వాయర్ పూడిపోయి నీరు అడిగంటిపోవడంతో ఉన్న కాస్త నీటిని జెసిబి సహాయంతో కాలువ తవ్వి నీటిని తీసుకెళ్లి పంటను రక్షించుకునే ప్రయత్నం రైతులు చేస్తున్నారు.

మద్దిగెడ్డ రిజర్వాయర్ నిర్మాణం చేసి సుమారు 40 సంవత్సరాలు దాటింది. ఈ జలాశయాన్ని ఆధారంగా చేసుకుని 8 పంచాయితీలు రైతులు సుమారుగా 4వేల ఎకరాల వ్యవసాయ భూమిలో రెండు పంటలు పండిస్తుంటారు. రిజర్వాయర్ నిర్మాణం చేసిన నాటి నుండి పూడిక తొలగింపు పనులు చేపట్టలేదు. ఎగువ ప్రాంతం నుండి నీటితోపాటు మట్టి కొట్టుకు రావడంతో రిజర్వాయర్ సగానికి పైగా పూడిక పోయింది. రిజర్వాయర్ మరమ్మతుల పేరుతో కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నా పూడిక తీతగాని, గట్టును గట్టిపర్చే పనులుగాని ఏనాడూ చేపట్టలేదు. పైపైన రంగులు వేయడం, చిన్నచిన్న కాంక్రీట్ పనులు మాత్రమే చేశారు. రిజర్వాయర్ సగానికి పైగా పూడికపోవడంతో పాటు ప్రాజెక్ట్ వెడమవైపున సుమారు పది అడుగుల గట్టు దిగిపోయింది. అయినా కూడా అధికారులు గాని, ప్రజా ప్రతినిధులు గాని దానిని పట్టించుకోలేదు. దీంతో వర్షాకాలంలో ఏ క్షణంలో గట్టు కొట్టుకుపోతుందోనని దిగువ ప్రాంతాల్లో ఉన్న గ్రామాల ప్రజలు ఆ సమయంలో తమ ప్రాణాలను అరిచేతులో పెట్టుకుని బిక్కుబిక్కుమని జీవిస్తున్నారు.

వర్షాకాలంలో కొద్దిపాటి వర్షానికే రిజర్వాయర్ జలకళను సంతరించుకుంటుంది. రెండు పంటలు పండుతాయని రైతాంగం ఎంతో ఆశగా రబీ పంటకూడా వేయగా, నేడు నీరు లేకుండా పోయింది. రిజర్వాయర్ పూడికపోవడంతో వర్షాకాలంలో వచ్చిన నీరు నిల్వ ఉండే పరిస్థితి లేదు. దీంతో ప్రస్తుతం రబీ వరి చేతికి అంది వస్తున్న సమయంలో పొలాలకు నీరు లేక రైతులు లబోదిబోమంటున్నారు.

రిజర్వాయర్‌లో ఉన్న కాస్త నీటిని పంట పొలాలకు శ్రమదానం చేస్తూ కొన్ని రోజులుగా తీసుకెళ్తున్నారు. అయితే నీటిమట్టం తగ్గిపోవడంతో రిజర్వాయర్ నుంచి పంట కాలువలకు నీరు రావడం లేదు. దీనిపై రైతాంగం ఎన్నిసార్లు అధికారులు దృష్టికి తీసుకెళ్లినా చెవిటివాడు చెవిలో శంఖం ఊదినట్లు ఉంది కానీ వారెవరికీ రైతుల బాధలు పట్టడం లేదు. దిక్కుతోచని స్థితిలో రైతులందరూ కలిసి జెసిపి తీసుకుని రిజర్వాయర్ గర్భం నుండి పంట కాలువ వరకు పూడిక తీసి వరి పొలాలకు నీరు తీసుకెళు తున్నారు. ఇప్పటికైనా ఉన్నతస్థాయి అధికారులు దృష్టి సారించి మద్దిగెడ్డ రిజర్వాయర్‌లో పూడిక తీసి నీరు నిల్వ ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని, దిగిపోతున్న ఎడమ గట్టును పటిష్టం చేయాలని రైతులు కోరుతున్నారు.

ఏకలవ్య పాఠశాలల్లో ఉపాధ్యాయులను నియమించాలి

ఎపి ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు

ప్రజాశక్తి-రంపచోడవరం : చింతూరు, రంపచోడవరం డివిజన్ల పరిధిలో ఉన్న ఏకలవ్య మోడల్ స్కూళ్ళలో తక్షణమే ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని ఎపి ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు డిమాండ్ చేశారు. బుధవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ 2024-2025 విద్యా సంవత్సరానికి ఏకలవ్య మోడల్ స్కూళ్లలో 8 గెస్ట్ టీచర్ల భర్తీ కొరకు గత ఏడాది అక్టోబర్ 29న నోటిఫికేషన్ విడుదల చేసి నవంబర్ 1న అభ్యర్థులకు డేమో క్లాసెస్ నిర్వహించారని తెలిపారు. నవంబర్ 5న ఐటిడిఎ పీఓ ఆధ్వర్యంలో ఉన్నతాధికారుల బృందం గెస్ట్ టీచర్ పోస్టులకు హాజరైన అభ్యర్థులకు ప్రత్యేకంగా ఇంటర్వ్యూలు నిర్వహించారని చెప్పారు. కాని నాటి నుండి గెస్టు టీచరు పోస్టులకు సంబంధించిన ఫలితాలు విడుదల చేయలేదని, దీనిపై సంబంధిత అధికారులను సంప్రదించగా ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉందని సాకులు చెప్పారని పేర్కొన్నారు. ఎన్నికల కోడ్ ముగిసి నెలలు రోజులు దాటినా ఇప్పటికి ఎందుకు ఫలితాలను వెల్లడించలేదని ప్రశ్నించారు. అదే సందర్భంలో పాడేరు డివిజన్ పరిధిలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూళ్లలో గెస్ట్ టీచర్ పోస్టులను ఇటీవల భర్తీ చేశారని తెలిపారు. కావున ఇప్పటికైనా అధికారులు స్పందించి చింతూరు, రంపచోడవరం డివిజన్ల పరిధిలో గల ఏకలవ్య మోడల్ స్కూళ్ళలో గెస్ట్ టీచర్ పోస్టులను భర్తీ చేయాలని లోతా రామారావు డిమాండ్ చేశారు.

మోదకొండమ్మ ఉత్సవాలకు ముహూర్తపు రాట

ప్రజాశక్తి-పాడేరు : పాడేరులో మే నెల 11, 12, 13వ తేదీల్లో నిర్వహిస్తున్న మోదకొండమ్మ అమ్మవారి జాతర మహోత్సవాల సందర్భంగా పాడేరు మెయిన్ రోడ్డు శతకం పట్టు వద్ద బుధవారం ముహూర్తపు రాట ప్రతిష్ట కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన ప్రజలు, ఆలయ కమిటీ సభ్యులు, ప్రజా ప్రతినిధులు డప్పు వాయిద్యాలతో ఊరేగింపుగా శతకం పట్టు వద్దకు తరలివచ్చి అంగరంగ వైభవంగా ముహూర్తం రాటను ప్రతిష్ఠ కార్యక్రమం జరిపారు. స్థానిక ఎమ్మెల్యే, ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ మత్స్యరాస విశ్వేశ్వర రాజు దంపతుల ఆధ్వర్యంలో భక్తులు పూజలు నిర్వహించి ముహూర్తపు రాటను ప్రతిష్ఠించారు. ఈ కార్యక్రమంలో విశాలపట్నం మాజీ జడ్పీ వైస్ పర్సన్ వంజంగి కాంతమ్మ, పలాసి కృష్ణారావు, కిల్లు గంగన్న పడాల్, కొట్టగుళ్లి సుబ్బారావు, కొట్టగుళ్లి సింహాచలం నాయుడు, కురుస ఉమామహేశ్వరరావు, వర్తన పిన్నయ్య దొర, ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కిల్లు కోటి బాబు, జడ్పీటీసీ.కిముడు శివ రత్నం, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ పోతు రాజు

జల్ జీవన్ మిషన్ పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-హుకుంపేట: మండలంలోని గత్తుం గ్రామ పంచాయతీ జి.బొడ్డపుట్టు కాలనీ, తోకవలసలో జల్ జీవన్ మిషన్ పనులకు సర్పంచ్ పాడి పోతు రాజు గ్రామ పెద్దలతో కలిసి బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, జి. బొడ్డ పుట్టు కాలనీలో 3లక్షలు, తోకవలసలో 3లక్షలతో జలజీవన్ మిషన్ పథకం ద్వారా నిధులు మంజూరు య్యాయని ఆయన పేర్కొన్నారు. ఈ పథకం ద్వారా గ్రామంలో ఉన్న ప్రతీ ఇంటికీ కుళాయి ద్వారా మంచినీళ్లు అందిస్తామని తెలిపారు. గ్రామస్తులు దగ్గర ఉండి జరుగుతున్న పనులను నాణ్యతను పరిశీలించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నేత కొండలరావు, గ్రామ పెద్దలు ఎస్.రాంబాబు, చిట్టిబాబు బాలకృష్ణ, మోహన్‌రావు పాల్గొన్నారు.


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కమిటీ ప్రతినిధులు

ముత్యాలమ్మ జాతర పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-చింతపల్లి: ఈనెల 24 నుంచి 27వ తేది వరకు చింతపల్లిలో జరిగే ముత్యాలమ్మ అమ్మవారి జాతర మహోత్సవ గోడ పత్రికను ముత్యాలమ్మ అమ్మవారి ఉత్సవ కమిటీ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు దురియ హేమంత్ కుమార్, పసుపులేటి విజయకరరావు ఆధ్వర్యంలో ఎంపీపీ కోరాబు అనూష దేవి, జడ్పీటీసీ పోతురాజు బాలయ్యలతో కలిసి బుధవారం జాతర గోడపత్రికలను లాంఛనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,జాతర మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు గ్రామస్తులతో పాటు చుట్టుపక్కల ప్రజలు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ కోశాధికారి హరీష్, వర్తక సంఘం ప్రధాన కార్యదర్శి పెద్దిరెడ్డి బేతాళుడు, ఉత్సవ కమిటీ సభ్యులు తాటిపాకల రమేష్, దూసబోయిన కొండబాబు, లోవరాజు పాల్గొన్నారు.


వాహనదారులను డబ్బులు అడుగుతున్న మహిళలు

ఇటుకల పండగ ప్రారంభం

గిరిజన గ్రామాల్లో సందడి

ప్రజాశక్తి-చింతపల్లి : ఆదివాసీ గిరిజన గ్రామాలలో ప్రతి ఏటా జరిగే ముఖ్యమైన పండగలలో ఒకటి ఇటుకల పండగ. ప్రస్తుతం చింతపల్లి ఏజెన్సీ గ్రామాలలో ఈ పండగ సందడి ప్రారంభమైంది. గిరి గ్రామాలలో ప్రతి ఏటా వేర్వేరు సమయాలలో వారం రోజులపాటు నిర్వహించే ఈ పండగ సందడితో సాగుతుంది. గ్రామాలలోని మగవారు వేటకు వెళ్లి అటవీ జంతువులను వేటాడడం, మహిళలు గ్రామాల సమీపంలో ప్రధాన రహదారులకు తాళ్లు, కర్రల సహాయంతో రోడ్డుకు అడ్డంగా చెక్ పోస్టులు ఏర్పాటు చేసి తాచేరు పేరిట చిల్లర వసూలు చేయడం ఈ పండగ ముఖ్య ఉద్దేశం. పండగలో భాగంగా మహిళల కోసం గ్రామంలోని పురుషులంతా వెదురు కర్రలతో ఉయ్యాల తయారు చేయడం, తయారుచేసిన ఉయ్యాలలో మహిళలు ఊగడం అదే రోజున పురుషులంతా మహిళలకు ప్రేమ విందు ఇవ్వడం మరుసటి రోజు గ్రామ సమీపంలో మొదటగా పనసకాయ, కోడి గుడ్డు, కోడి పిల్ల ఏర్పాటు చేసి వాటిపై కొట్టి వేటను ప్రారంభిస్తారు. తరువాత పూర్వీకుల ఆచారం ప్రకారం మూడు రోజులపాటు చిన్న పెద్ద తేడా లేకుండా పురుషులందరూ అడవికి వేటకు వెళ్తారు. పురుషులు వేట నుంచి వచ్చేంతవరకు గ్రామంలోని మహిళలు సమీపంలో రహదారులకు అడ్డంగా తాడ్లు, వెదురు కర్రల సహాయంతో చెక్ పోస్టులు ఏర్పాటు చేసి తాచేరు పేరుతో వాహనాలను అడ్డుకుంటూ గిరిజన సంప్రదాయ పాటలు పాడుతూ, అటుగా వచ్చిన వాహనదారులు, పాదచారులపై రంగు నీళ్లు చల్లుతూ సందడి చేస్తారు. వారి నుంచి చిల్లర వసూలు చేస్తారు. ఇక అడవిలో వేటకు వెళ్లిన పురుషులంతా అడవిలో జంతువులు, పక్షులను గాని వేటాడి వాటితో గ్రామంలోకి వస్తారు. వేటాడిన జంతువు, పక్షులను గ్రామంలో వేటాడిన వ్యక్తికి, ఆ జంతువులతో భారీగా గ్రామస్తులు సమీకరణ చేసి ఊరేగిస్తారు. ఎవరైనా వేటాడకుండా ఒట్టి చేతులతో తిరిగి వస్తే మహిళలంతా వారి నుంచి జరిమానా వసూలు చేస్తారు. ఈ ఏడాది వ్యవసాయం బాగుండాలని మంచిగా పంటలు పండాలని ఇంటింటి నుంచి అన్ని రకాల విత్తనాలను గ్రామ దేవత వద్దకు తీసుకువచ్చి పసుపు కుంకుమలు సమర్పించి, పూజలు చేస్తారు. కొన్ని విత్తనాలు గ్రామ దేవతకు సమర్పించి పూజ తర్వాత మిగిలిన విత్తనాలను తమ తమ ఇళ్లకు తీసుకువెళ్తారు. గ్రామ దేవతకు మొక్కులు చేసిన విత్తనాలతో వ్యవసాయం ప్రారంభిస్తే ఈ ఏడాది పంటలు బాగా పండుతాయని గిరిజనులు బలంగా నమ్ముతారు. వసూలు చేసిన డబ్బులతో సమిష్టిగా గ్రామంలో విందు చేసుకుంటారు. ఇందులో భాగంగానే మండలంలోని చింతలూరులో గ్రామ ఇటుకల పండుగను పురస్కరించుకొని చింతపల్లి నర్సీపట్నం జాతీయ ప్రధాన రహదారికి తాచేరు ఏర్పాటుచేసి వాహనదారుల నుంచి చిల్లర వసూలు చేస్తున్నారు.

11న చింతపల్లి మండల సమావేశం

ప్రజాశక్తి-చింతపల్లి: మండలం మండల పరిషత్ అధ్యక్షురాలు కోరాబు అనూష దేవి ఆదేశాల మేరకు ఈ నెల 11న చింతపల్లి మండల పరిషత్ సమావేశ మందిరంలో సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేస్తామని ఎంపిడిఓ యువిఎస్ శ్రీనివాసరావు తెలిపారు. సమావేశం ఉదయం 10:30 నిమిషాలకు ప్రారంభం కానుందని, ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా పాడేరు శాసనసభ్యులు మత్స్యరాస విశ్వేశ్వరరాజు, అరకు పార్లమెంటు సభ్యురాలు తనుజారాణి హాజరవుతున్నారని ఆయన తెలిపారు. ఈ సమావేశానికి మండల ప్రాదేశిక సభ్యులు(ఎంపిటిసి), సర్పంచులు, అధికారులు హాజరు కావాలని కోరారు.

తాగునీటి సమస్యపై నిర్లక్ష్యం వద్దు

ప్రజాశక్తి -అనంతగిరి:మండలంలో 24 పంచాయతీల పరిధి మారుమూల గిరిజన గ్రామాల్లో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించడంలో పంచాయతీ కార్యదర్శులు నిర్లక్ష్యం వహించ వద్దని స్థానిక ఎంపీపీ శెట్టి నీలవేణి తెలిపారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయం వద్ద పంచాయతీ సచివాలయం కార్యాలయం వద్ద సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, వేసవి నేపథ్యంలో మారుమూల గ్రామాలలో తాగునీటి సమస్య ఎదురయ్యే పరిస్థితి ఉందని ప్రజల నుండి ఫిర్యాదులు వచ్చిన వెంటనే పరిష్కారానికి కృషి చేయాలన్నారు. లేకుంటే తమ దృష్టికి తీసుకువచ్చినట్లయితే మరమ్మతు పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని ఆమె అన్నారు ఊట నీటిపై ఆధారపడి జీవిస్తున్న గ్రామాల పై దృష్టి పెట్టాలని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎంపీడీవో కుమార్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు


మాట్లాడుతున్న ఎంపిపి నీలవేణి


మాట్లాడుతున్న ఎంపిడిఒ కుమార్

ప్రజా సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి -అనంతగిరి:సచివాలయ సిబ్బంది ప్రజల సమస్యలను పరిష్కరించాలని ఎంపీడీవో ఎవివి. కుమార్ తెలిపారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయం వద్ద పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామాల్లో నెలకొన్న సమస్యలు గుర్తించి పరిష్కరించడంతోపాటు సచివాలయం సిబ్బంది విధుల నిర్వహణపై దృష్టి పెట్టవలసిన అవసరం ఉందని కార్యదర్శులకు సూచించారు. వేసవికాలం దృష్ట్యా ప్రతి పంచాయితీ కూడలి వద్ద చలివేంద్ర కేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించామన్నారు. తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు

విశాఖ పోర్టు రవాణాలో కొత్త సరకు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

వైజాగ్ పోర్టు 2024-2025 ఆర్థిక సంవత్సరంలో 82.62 మిలియన్ టన్నుల కార్గో హేండ్లింగ్ చేసి సరికొత్త రికార్డును స్థాపించడం వెనుక ఆఫ్రికాకు పోర్టు నుంచి ఈ సంవత్సరంలో 1.1మిలియన్ టన్నుల బియ్యం ఎగుమతులే కీలక పాత్ర పోషించాయి. అంతేగాకుండా బాక్సైట్, మాంగనీస్ ఓర్ పశ్చిమాఫ్రికాలోని గిన్నా ప్రాంతం నుంచి విశాఖ పోర్టుకు దిగుమతి కావడంతో కార్గో హేండ్లింగ్ ఒక్కసారిగా పెరిగిందని పోర్టు ఉన్నతాధికారులు తాజాగా వెల్లడించారు. మాంగనీస్ గిన్యా నుంచి 3.8 మిలియన్ టన్నులు, బాక్సైట్ (ఆఫ్రికా నుంచి) 1.7 మిలియన్ టన్నులు ఈ ఆర్థిక సంవత్సరంలో దిగుమతి అయ్యింది. బియ్యం అత్యధికంగా దేశంలోని ఛత్తీస్‌గడ్ రాష్ట్రం రాయపూర్ నుంచి విశాఖ పోర్టుకు రోడ్డు మార్గంలో రవాణా అవుతోంది. ఇక్కడ నుంచి ఆఫ్రికా ఖండానికి అత్యధికంగా బియ్యం ఎగుమతులు జరగడంతో కార్గో హేండ్లింగ్‌లో ఒక ఊపు వచ్చినట్టయింది. బియ్యం, బాక్సైట్, మాంగనీస్ ఓర్ సరికొత్త సరకుగా పోర్టు అధికారులు చెబుతున్నారు. థర్మల్ కోల్‌ను తొలినుంచీ పోర్టు హేండిల్ చేస్తున్న సంగతి తెలిసిందే.

మేజర్ పోర్టుల్లో అగ్రశ్రేణికి ఎదగడమే లక్ష్యంగా...

2025-26 ఆర్థిక సంవత్సరానికి 90 మిలియన్ టన్నుల కార్గో హేండ్లింగ్ లక్ష్యంగా వైజాగ్ పోర్టు దేశంలోని మేజర్ పోర్టులన్నిట్లోకి అగ్రశ్రేణిలో కొనసాగేందుకు కృషిని ప్రారంభించినట్లు ఇటీవలే పోర్టు ట్రస్ట్ అథారిటీ (విపిఎ) కార్యదర్శి టి.వేణుగోపాల్ వెల్లడించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఆయిల్ ఎగుమతులు కూడా పెరిగే అవకాశాలున్నాయన్నది తెలుస్తోంది. పోర్టు మొత్తంగా చూసినప్పుడు అవుటర్, ఇన్నర్ హార్బర్లన్నిటినీ ఆధునీకరించడంలో ప్రత్యేక కృషి చేసింది. మెకనైజేషన్‌కు అత్యంత ప్రాధాన్యతనిస్తూ రైల్వే, కస్టమ్స్, పోర్టు ఉద్యోగులు, కార్మికులను సమన్వయం చేయడంలో కీలక పాత్రపోషిస్తూ వస్తోంది.

ఇగ్నో చిత్రలేఖన పోటీలు

ప్రజాశక్తి -ఎంవిపి.కాలనీ : అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని ఇగ్నో విశాఖపట్నం ప్రాంతీయ కేంద్రం ఆధ్వర్యాన లాసన్స్ బే కాలనీలో ఉన్న జివిఎంసి ప్రాథమిక పాఠశాలలో 4, 5 తరగతులు చదువుతున్న విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. సుమారు 65 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీలో గెలుపొందిన వారికి ఏప్రిల్ 14న అంబేద్కర్ జయంతి సందర్భంగా ఇగ్నో ప్రాంతీయ కేంద్ర కార్యాలయంలో జరిగే కార్యక్రమంలో బహుమతులు, ధ్రువపత్రాలు అందజేస్తామని ఇగ్నో సీనియర్ ప్రాంతీయ సంచాలకులు డాక్టర్ గోనిపాటి ధర్మారావు, ఉప సంచాలకులు డాక్టర్ ఇ.కృష్ణారావు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు డి.సుధాకిరణ్, వివి పతిరావునాయుడు, వి.వెంకటరమణ పాల్గొన్నారు.

'సరస్వతి' స్కాలర్‌షిప్‌పై అవగాహన


జ్యోతిప్రజ్వలనతో వర్క్‌షాప్ ప్రారంభిస్తున్న ఎఐసిటిఇ కార్యదర్శి రాజీవ్‌కుమార్

ప్రజాశక్తి-మధురవాడ : అఖిల భారత సాంకేతిక విద్యామండలి (ఎఐసిటిఇ) అందిస్తున్న సరస్వతి స్కాలర్‌షిప్‌లు, ఇతర పథకాలపై అవగాహనకు గీతం విశ్వవిద్యాలయంలో బుధవారం వర్క్‌షాప్ నిర్వహించారు. ఎఐసిటిఇ సభ్య కార్యదర్శి డాక్టర్ రాజీవ్‌కుమార్ మాట్లాడుతూ, సరస్వతి స్కాలర్‌షిప్ వంటి పథకాలు దేశంలోని ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాలలోని కళాశాల విద్యార్థులను, ప్రత్యేకంగా ఆర్థికంగా బలహీన వర్గాల అమ్మాయిలకు ఆర్థికచేయూతగా ఉంటాయన్నారు. ఉన్నత విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు విద్యావకాశాలు, ఆర్థికసాయానికి ఫండింగ్ ఏజెన్సీలపై అవగాహన కల్పించారు. ఎఐసిటిఇ సలహాదారు డాక్టర్ ఎన్.హెచ్. సిద్ధలింగస్వామి మాట్లాడుతూ బలహీన వర్గాల్లోని ప్రతిభావంతులైన అమ్మాయిలు ఎఐసిటిఇ ఆమోదించిన సంస్థల్లో బిబిఎ, బిసిఎ, బిఎంఎస్ వంటి ప్రోగ్రామ్స్ అభ్యసించడానికి అవసరమైన సాయం అందించేందుకు ఉద్దేశించిందన్నారు. వర్క్‌షాప్‌లో ఎఐసిటిఇ డాక్టోరల్ ఫెలోషిప్ (ఎడిఎఫ్), ఎఐసిటిఇ ఫండింగ్ స్కీమ్స్ కింద నూతన ఆవిష్కరణలు, నైపుణ్యాభివృద్ధి, ఫ్యాకల్టీ అభివృద్ధి, సాంకేతిక విద్యారంగంలో పరిశోధనను ప్రోత్సహించే ఇతర పథకాలపై వివరించారు. విద్యార్థులు, ఉపాధ్యాయలకు ఆయా పథకాలపై సందేహాల నివృత్తి, స్పష్టతకు ఇంటరాక్టివ్ సెషన్స్ నిర్వహించారు. గీతం వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఎరోల్ డిసౌజా అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో గీతం ప్రోవైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వై.గౌతమ్‌రావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.గుణశేఖరన్, గీతం ఐక్యూఎసి డైరెక్టర్ ప్రొఫెసర్ రాజా ప్రభు ఆర్, ఎఐసిటిఇ ఉన్నత అధికారులు విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

బడిఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలి

సమగ్ర శిక్ష జిల్లా ప్రాజెక్టు అధికారి చంద్రశేఖరరావు


ఉపాధ్యాయులకు సూచనలు చేస్తున్న ఎపిసి

ప్రజాశక్తి-ఆనందపురం : బడి ఈడు పిల్లలందరినీ పాఠశాలల్లో చేర్పించాలని సమగ్ర శిక్ష జిల్లా ప్రాజెక్టు అధికారి జోగా చంద్రశేఖరరావు అన్నారు.. బుధవారం బొడ్డ పాలెం, వేములవలస ఎస్‌సి కాలనీ ఎంపిపి పాఠశాలల పరిధిలో డ్రాపౌట్ పిల్లల వెరిఫికేషన్‌ను పరిశీలించారు. బొడ్డుపాలెంలో ఒకరు, వేములవలస ఎస్‌సికాలనీలో ఇద్దరు డ్రాపౌట్ పిల్లలను గుర్తించి, వారి తల్లిదండ్రులతో మాట్లాడారు.

పిల్లలను ప్రతిరోజూ పాఠశాలకు పంపించాలని, నాణ్యమైన చదువుతోపాటు మధ్యాహ్నభోజనం, ఉచిత పాఠ్యపుస్తకాలు, ఇతర ప్రభుత్వ ప్రయోజనాలు కల్పిస్తామని అవగాహన కల్పించారు. అనంతరం ప్రతి విద్యార్థి లాంగ్వేజెస్‌లో రీడింగ్, రైటింగ్ స్కిల్స్ మెరుగుపరుచుకునేలా చర్యలు చేపట్టాలని ఉపాధ్యాయులకు సూచించారు. వేములవలస కాలనీలోని రెండు అంగన్వాడీ కేంద్రాలను సందర్శించి, పిల్లల సంఖ్య పెంచాలని సూచించారు. ఐదేళ్లు నిండిన పిల్లలందరినీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో చేర్పించేందుకు కృషి చేయాలన్నారు. అనంతరం ఆనందపురం ఉన్నతపాఠశాలలో పిఎంశ్రీ నిధులతో చేపడుతున్న మైదానం అభివృద్ధి, ఇతర పనులను పరిశీలించి, సకాలంలో పూర్తిచేయాలని ఎఇ శ్రీనివాస్, హెచ్‌ఎం కెఆర్‌కె.పట్నాయక్,పిడి ప్రసాద్‌లకు సూచించారు. ఎంఇఒ జోగేంద్రనాథ్, సిఆర్‌పి షిణగం శివాజీ పాల్గొన్నారు.

జీడి పిక్కల వ్యాపారుల దోపిడీని అరికట్టాలి


ఐటిడిఎ ఎదుట ఆందోళన చేస్తున్న చైతన్యవేదిక నేతలు

ప్రజాశక్తి-రంపచోడవరం :ఏజెన్సీలో జీడిపిక్కల వ్యాపారుల ఇష్టారాజ్యంగా తూకల్లోనూ, ధరల్లోనూ యథేచ్ఛగా మోసాలు చేస్తూ దోపిడీ చేస్తున్నారని, వారి దోపిడీని అరికట్టాలని ఆదివాసీ సంఘాల కూటమి నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం వారు స్థానిక ఐటిడిఎ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈసందర్భంగా ఆదివాసీ చైతన్య వేదిక అధ్యక్షులు వెదుళ్ల లచ్చిరెడ్డి, ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా అధ్యక్షులు తీగల బాబురావు మాట్లాడుతూ ఆదివాసీ రైతుల నుండి వందన్ వికాస్ కేంద్రాల ద్వారా జీడి పిక్కలు కొనుగోలు చేస్తామని రంపచోడవరం ఎమ్మెల్యే శిరీషాదేవి, ఐటిడిఎ పిఒ కట్టా సింహాచలం చెప్పారని, కాని ఏజెన్సీలో ఎక్కడా విడివికె కొనుగోలు కేంద్రాలు కానరావటం లేదని పేర్కొన్నారు. గ్రామాల్లో ప్రైవేట్ వ్యాపారస్తులు అమాయక ఆదివాసీ రైతుల నుండి ఇష్ట రాజ్యాంగా తక్కువ ధరకు కొనుగోలు చేస్తూ మోసం చేస్తున్నారని ఆరోపించారు. గతంలో డ్వాక్రా సంఘాల ద్వారా కొనుగోలు చేసినప్పుడు రైతులకు మేలు జరిగిందని తెలిపారు. దళారులు తూకల్లో, రేట్లల్లో రైతులను మోసాలు చేస్తుంటే ప్రభుత్వం చూసీచూడనట్లు వ్యవహరిస్తుందని ఆరోపించారు. పేరుకే వందన వికాస్ కేంద్రాలు ఏర్పాటు చేశారని, రైతులను మోసం చేసే కుట్రలో ఇదో భాగమని పేర్కొన్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రభుత్వం స్పందించి దళారుల నుండి జీడి రైతులను రక్షించి వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎఎస్‌పి డివిజన్ అధ్యక్షులు మోడిద నూకరాజు, కార్యదర్శి చోడి ప్రదీప్ దొర, గొర్లె నారాయణ, కారం రామన్న దొర, సిద్ధాంతి, రమణ పాల్గొన్నారు.

ప్రాధాన్యతా గ్రామాలను గుర్తించి ప్యాకేజీ ఇవ్వండి

ప్రజాశక్తి-కూనవరం :ప్రాధాన్యతా గ్రామాలను గుర్తించి ప్యాకేజీ ఇవ్వాలని తెలుగు యువత అరకు పార్లమెంట్ అధికార ప్రతినిధి గడేసుల రంజిత్ కుమార్ ఆధ్వర్యంలో ధవళేశ్వరంలోని పోలవరం ఆర్ అండ్ ఆర్ అడ్మినిస్ట్రేటివ్ అధికారి అభిషేక్‌ను కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా రంజిత్ కుమార్ మాట్లాడుతూ కూనవరం మండలంలో ఉన్న కాచవరం, పోచవరం పంచాయితీలను 2022 గోదావరి వరద లెక్కల ప్రకారం మరూన్ విలేజ్‌లుగా అప్పటి ప్రభుత్వం ప్రకటించిందని చెప్పారు. దీనికి తోడు ప్రతి ఏటా వచ్చే గోదావరి వరద వలన ఈ గ్రామల ప్రజలు చాలా ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. అందువల్ల ఈ గ్రామాలను పోలవరం 41.15 మొదటి కాంటూరులో కలిపి ఆర్‌ఆర్ ప్యాకేజీ ఇప్పించి ఆదుకోవాలని కోరారు. దీనిపై అడ్మినిస్ట్రేటివ్ అధికారి అభిషేక్ సానుకూలంగా స్పందించి వెంటనే ఈ సమస్యను జలవనరుల శాఖ మంత్రి, సీఎం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు రంజిత్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో నలగొర్ల రాజు, షేక్ సుభాని, పునేం శ్రీరాములు, కొర్రపాటి శ్రీనివాస్, కట్టం నాగేశ్వరరావు, మల్లాడి రాంబాబు, ఓలేటి ఈశ్వరరావు, ఆలూరి రవీంద్ర, తోటకూర వీర్రాజు, మెండా హరి, పునేం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.


ఆర్అండ్ ఆర్ ఎఒ అభిషేక్‌కు వినతిపత్రం ఇస్తున్న తెలుగు యువత నేత

నాటుసారా బట్టీపై ఎక్సైజ్ పోలీసుల దాడి

1400 లీటర్లు బెల్లం ఊట ధ్వంసం : ఇద్దరు అరెస్టు


పట్టుబడిన నిందితులతో ఎక్సైజ్ పోలీసులు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : మండలంలోని కిర్రాబు గ్రామ సమీపంలోని మడేరు వాగు సమీపంలో అక్రమంగా నిర్వహిస్తున్న నాటుసారా బట్టీపై రంపచోడవరం ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఆధ్వర్యంలో సిబ్బంది బుధవారం దాడులు నిర్వహించారు. బట్టీని, సారా తయారీకి ఉపయోగించే 1400 లీటర్లు బెల్లం పులుపును ధ్వంసం చేశారు. బట్టి నిర్వహిస్తున్న వ్యక్తిని, అతనికి బెల్లాన్ని సరఫరా చేస్తున్న బెల్లం వర్తకుడిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. వారి నుండి ఒక ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఎవరైనా నాటుసారా తయారు చేసినా, విక్రయించినా, తరలించిన చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎవరి వద్దనైనా నాటుసారా సంబంధిత సమాచారం ఉంటే రంపచోడవరం ఎక్సైజ్ స్టేషన్‌కు తెలియజేయాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు అత్యంత గోప్యంగా ఉంచబడతాయని చెప్పారు. ఈ దాడులలో ఎక్సైజ్ హెడ్ కానిస్టేబుల్ నాయుడు, సిబ్బంది సత్యనారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

రాయితీ రుణాలకు ఇంటర్వ్యూలు


ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న అధికారులు.

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో ఓసి, బీసీ సబ్సిడీ రుణాల మంజూరుకు ఎంపిడిఓ ఎల్.యాదగిరీశ్వరరావు అధ్యక్షతన రాజవొమ్మంగి, జడ్డంగి బ్యాంకు మేనేజర్లు సమక్షంలో దరఖాస్తుదారులు 187 మందికి బుధవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ మాట్లాడుతూ పారదర్శకంగా ఇంటర్వ్యూలు నిర్వహించి 40 మందిని ఎంపిక చేసినట్లు తెలిపారు. వారిలో 23 మంది రాజవొమ్మంగి యూనియన్ బ్యాంక్ పరిధిలో ఉన్నవారికి, జడ్డంగి బ్యాంకు పరిధిలో మిగిలిన వారికి ఓసి, బీసీ అభ్యర్థులుగా విభజించి ఎంపిక చేసినట్టు చెప్పారు. ఎంపిక వారికి తొందరలోనే రుణాలు మంజూరు చేస్తామని బ్యాంకు మేనేజర్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కార్యాలయం సిబ్బంది, అభ్యర్థులు పాల్గొన్నారు.

'విశాఖ'లో ఉచిత పాలిసెట్ శిక్షణ

ప్రజాశక్తి- వేపగుంట :నరవలోని విశాఖ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ టెక్నాలజీ కళాశాలలోని పాలిటెక్నిక్ కళాశాలలో పాలిసెట్ ఉచిత శిక్షణ తరగతులు ప్రారంభించినట్లు ప్రిన్సిపల్ పి.ప్రసాద్ తెలిపారు. ఈ అవకాశాన్ని పదవ తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులంతా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. శిక్షణకు వచ్చే విద్యార్థులకు స్టడీ మెటీరియల్ ఉచితంగా అందజేస్తామన్నారు. పాలిటెక్నికల్ ప్రవేశపరీక్షకు ఇప్పటివరకు దరఖాస్తు చేసుకోకపోతే తమ కళాశాలలో ఉచితంగా దరఖాస్తుల అందజేస్తామన్నారు. ప్రతిరోజూ ఉదయం 9:30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహించే శిక్షణ తరగతులను వినియోగించుకుని మంచి ర్యాంకు సాధించాలని ఆకాంక్షించారు. కళాశాల చైర్మన్ జి. సత్యనారాయణ, ఇంజనీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ జివి.ప్రదీప్ వర్మ, వివిధ విభాగాధిపతులు, అధ్యాపక సిబ్బంది ఉన్నారు.

కళారత్న పురస్కార గ్రహీతకు అభినందన



చలపతిరావును అభినందిస్తున్న శ్రీరామ్మూర్తి, తదితరులు

ప్రజాశక్తి- ములగాడ : కళారత్న పురస్కార గ్రహీత సుంకర చలపతిరావును బుధవారం స్థానిక శాఖాగ్రంథాలయంలో ఘనంగా సత్కరించి, అభినందించారు. లైబ్రేరియన్ వి.అజయ్‌కుమార్ అధ్యక్షతన అభినందన సభలో ముఖ్యఅతిథి పౌర హక్కుల సంఘం అధ్యక్షులు జిల్లా టి.శ్రీరామ్మూర్తి మాట్లాడుతూ, రచయిత, పరిశోధకుడు, జర్నలిస్టు, సామాజిక కార్యకర్త, విమర్శకునిగా చలపతిరావు బహుముఖ ప్రజ్ఞను కొనియాడారు ప్రజా వైద్యులు డాక్టర్ పి. హేమలత, జాతీయ సేవా పథకం జిల్లా నోడల్ అధికారి ఇపిఎస్. భాగ్యలక్ష్మి, ఉపాధ్యాయులు ప్రకాశరావు, చిత్రకారులు ద్వారపూడి శ్రీనివాస మనోహర్, శివ, మహేష్ పాల్గొని చలపతిరావును అభినందించారు.